క్లుప్తంగా

అందరి జీవితాల్లో సంతోషం నిండాలి


నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో సంతోషం నిండాలని సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆకాంక్షించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు భోగీ, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో భోగభాగ్యాలు కలగాలని, సంక్రాంతి సంతోషాన్ని నింపాలని, కనుమ అన్నదాతల అష్టైశ్వర్యాలు కురిపించాలని ఆయన ఆకాంక్షించారు.

గొబ్బెమ్మ ఉత్సవం


ఊరేగుతున్న గొబ్బిదేవత

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వైభవంగా మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం జరిగింది. అందులో భాగంగా ఆదివారం ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. చప్పరాలపై అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు.

20న మహా కుంభాభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరి వద్ద ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి మండపానికి ఈనెల 20వ తేదీ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు ఈపూజలు నిర్వహిస్తారన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


ప్రశంసాపత్రాలు అందుకున్న రక్తదాతలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వివేకానందుడి జయంతి రోజున రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. శిబిరంలో ఎన్టీఆర్ ట్రస్టు వైద్యులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పదవీ విరమణ పొందిన విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. పాఠశాలనే ఆలయంగా భావించి ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు, కాటూరు గ్రామాల్లో పర్యటించి, ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీని పరిశీలించారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమిలో వేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ ఉపయోగం గురించి తెలియజేసి, పీఎం కిసాన్ ఈకేవైఏసీ, ఆర్బీకేల ద్వారా సరఫరా అవుతున్న ఎరువులపై గురించి చర్చించారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముగం, ఏఓ భారతి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'ట్రెక్కింగ్'తో సందడి

తిరుపతి కల్చరల్: తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్ ట్రెక్కింగ్ గ్రూప్ 50 మందితో కలిసి రామాపురం సమీపంలోని పీవీ పురంలోనున్న అడవిలో సాహస, సరదాల ట్రెక్కింగ్ ఆదివారం ముగిసింది. ఈ ట్రెక్కింగ్‌లో బెంగళూరు, చెన్నై ట్రెక్కర్స్ సైతం పాల్గొని సందడి చేశారు. అడవిలోని జలపాతాలు, లోయలను సందర్శించి ఆదివారం రాత్రి తిరుపతికి చేరారు.

ఆపదొస్తే అంతే !





- రైల్వే గేట్లు.. జనం పాట్లు
- అండర్ బ్రిడ్జి లేక అగచాట్లు
- రాకపోకలకు తీవ్ర ఆటంకం


ఎస్‌యూపురం వద్ద రైల్వే గేటు వేయడంతో బైక్‌ను గేటు కింద నుంచి తోసుకెళుతున్న గ్రామస్తుడు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : మూడు గ్రామాల్లోని సుమారు 3000 మంది జనం రోజు రాకపోకలు సాగించాలంటే రైల్వే గేట్లు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఆపదొచ్చినా గేట్లు పడడంతో కళ్లెదుటే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇక నిత్యం ఆ ఊరి ప్రజలకు గేటు గండం తప్పడం లేదు. సమయానికి గమ్యానికి చేరుకోలేక ఆ గ్రామాల్లోని ప్రజలు నరక యాతన పడుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారే లేరని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రేణిగుంట మండలంలోని కృష్ణాపురం, ఎస్‌యూపురం పంచాయతీలకు వెళ్లాలంటే తిరుపతి–నెల్లూరు రైల్వే మార్గాన్ని దాటుకొని వెళ్లాలి. ఈ రైల్వే మార్గంలో సుమారుగా రోజుకు 70 నుంచి 80 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. మల్లవరం–ఎస్‌యూపురం మధ్యలో ఒక రైల్వే గేట్ ఉండగా కృష్ణాపురం–పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి మధ్యలో మరో రైల్వే గేటు ఉంది. ఈ రెండు పంచాయతీల్లో సుమారు 3000 మంది నివసిస్తున్నారు. నిత్యం వీళ్లు రాకపోకలు చేయాలంటే ఈ రైల్వే గేటు దాటుకొని వెళ్లాలి, వేరే మార్గం లేదు. దశాబ్దాల కాలం నుంచి ఇవే మార్గాల ద్వారా ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రైలు రాకపోకల సమయంలో రైల్వే గేట్ వేస్తుండటంతో నిత్యం రాకపోకలకు నరకయాతన పడుతున్నారు.

అత్యవసర సమయంలోనూ అవస్థలే..

మూడు గ్రామాల్లోని ప్రజలకు ఏవైనా అత్యవసర సమస్య ఎదురైన సమయంలో రైల్వే గేట్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురిటి నొప్పులు, విష పురుగులు కాటు వేసినప్పుడు తీసుకెళ్లెందుకు అంబులెన్సు గ్రామాల్లోకి రావాలన్న... తిరిగి వెళ్లాలన్న రైల్వే గేట్ సమస్యతో అత్యవసర చికిత్సలు అందకం ప్రాణాపాయ స్థితుల్లోకి వెళ్లిన పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

విద్యార్థుల ఇక్కట్లు

ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు రైల్వే గేట్ అంతరాయంతో సమయానికి గమ్యాన్ని చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. రెండు రైల్వే గేట్ల స్థానంలో రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తే ప్రజలకు మేలు చేకూర్చినట్లు అవుతుంది.

నా చిరకాల కోరిక...



"రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మిస్తే కృష్ణాపురం పంచాయతీలోని ప్రజలకు ఎంతో మేలు చేసిన వాళ్లు అవుతారు. నేను చిన్నప్పటి నుంచి రైల్వే గేటు సమస్య అలాగనే ఉంది. నా చిరకాల కోరిక ఏమైనా ఉంది అంటే అది రైల్వే బ్రిడ్జి మాత్రమే. ఎంపీ సమస్యకు పరిష్కారం చూపుతారని ఆశిస్తున్నా.

– ముద్దురాయలు, సర్పంచ్, కృష్ణాపురం

ఏళ్లుగా ఇబ్బందులు



రైల్వే గేటుతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం రైళ్లు వస్తుండడంతో ఎప్పుడు రైలు గేటు వేస్తారో తెలియని అయోమయ పరిస్థితి. అత్యవసర సమయంలో అంబులెన్సు రావాలన్న వీలుకాని దుస్థితి. అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నా.

– రామచంద్రయ్య, కృష్ణాపురం

సర్వే చేశారు.. వదిలేశారు..



రైల్వేగేటు వేయడంతో ఎస్‌యూపురం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలలకు వెళ్లే పిల్లలు సమయానికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. స్కూల్ బస్సులు మా గ్రామాల్లోకి వచ్చేందుకే భయపడుతున్నారు. గతంలో ఒకసారి అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని సర్వేలు చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

– శేఖర్ రాజు, ఎస్‌యూపురం

మాజీ ఎమ్మెల్యే నివాళి


గురవయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట : వైఎస్సార్‌సీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ తండ్రి రైల్వే విశ్రాంత ఉద్యోగి గురవయ్య(79) అనారోగ్యంతో ఆస్పత్రి లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో పట్టణంలోని సీబీఐడీ కాలనీలో ఆయన నివాసం వద్ద మృతదేహాన్ని ఉంచారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని గురవయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేతో పాటు ఏర్పేడు పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ మస్తాన్, జాన్‌బాబు, డాక్టర్ జనార్దన్, సర్పంచ్ సురేంద్ర యాదవ్ తదితరులు ఉన్నారు.

బాలయ్య కుటుంబానికి పరామర్శ


నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని నెలవాయికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బాలయ్యనాయుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం గ్రామంలో జరిగిన కర్మ క్రియలకు హాజరైన సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలయ్యనాయుడు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, రవిరెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, జయచంద్రనాయుడు, కారణి వెంకటేష్, సర్పంచ్ సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


ప్రదర్శనలు చేసిన చిన్నారులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్రినేత్ర నాట్యాలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శనివారం రాత్రి నిర్వహించారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేట, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, సాయిదత్త తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం


పట్టణంలో స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు పండుగ రద్దీ మరో వైపు మాడా వీధుల్లో పోలీసు ఆంక్షలతో జనం అవస్థలు పడ్డారు. పట్టణంలో సాధారణంగా నగరి , నెహ్రూ వీధులు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. ఒకటి కొంటే ఒకటి ఉచితం అనే వ్యాపార ప్రకటనలతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పట్టణంలో ఇసుక వేస్తే రాలనంత రద్దీ నెలకొంది. అసలే చిన్న రోడ్లు, ఒక సైడ్ పార్కింగ్ ఆంక్షలు తుంగలో తొక్కి ద్విచక్ర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో జనం అవస్థలు పడ్డారు. దీనికి తోడు ఆటోల సంచారం, ట్రాక్టర్ల రాకతో పోలీసులకు ముచ్చెమటలు పట్టాయి. వైకుంఠ ఏకాదశి, నారావారి పల్లెలో ముఖ్యమంత్రి బందోబస్తు కింద పోలీసులు అందరూ డ్యూటీలకు వెళ్లిపోయారు. దీంతో ఉండే ఇద్దరు, ముగ్గురు పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించలేక అవస్థలు పడ్డారు.

అందుబాటులో విడిది మండపాలు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా విడిది కోసం గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ధర్మకర్తల మండలి తీర్మానంలో 9 విడిది మండపాలకు రూ.16.50 లక్షలకు ఆమోదం తెలిపారు. పనులు ప్రారంభించారు. మూడు మండపాలు పూర్తయ్యాయి. మిగిలినవి ఫిలర్స్ వరకు వచ్చాయి. ఆ తరువాత ఎన్నికలు రావడంతో కొత్త ప్రభుత్వం వచ్చినా నాలుగు నెలలు విడిది మండపాలు పనులు పునఃప్రారంభం కాకపోవడంతో గత అక్టోబరులో పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించి అధికారులకు త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆ విడిది మండపాలు పూర్తయ్యాయి. ఆదివారం వాటిని అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. 15న జరిగే గిరి ప్రదక్షిణలో భాగంగా విడిది మండపాలు పూజలకు సిద్ధమయ్యాయన్నారు. అదే విధంగా మండపాల వద్ద బోర్లు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

శ్మశాన వాటికలో వసతులు


పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నగేషం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): హిందువులకు పవిత్రమైన పెద్ద పండుగను పురస్కరించుకొని రేణిగుంట హిందూ శ్మశాన వాటికలో రెండు రోజులుగా సర్పంచ్ నగేషం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శ్మశానం మొత్తం శుభ్రం చేసి గోడలకు రంగులు వేయించారు. శ్మశానంలోని పరమేశ్వరుడి విగ్రహానికి నూతన మెరుగులు దిద్దారు. సంక్రాంతి పండుగ పర్వదినం రోజున హిందువులు పెద్దలను స్మరించుకొని శ్మశాన వాటికలోని వారి సమాధుల వద్ద పూజలు చేస్తారు. అందులో భాగంగానే హిందూ శ్మశాన వాటికలో పనులు నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఈఓ సమీక్ష

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలన భవనంలో ఈఓ బాపిరెడ్డి ఆదివారం ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ఆరుద్ర నక్షత్ర పూజలు, 15న గిరి ప్రదక్షిణపై సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన కోరారు.

యువతకు వివేకానందుడు ఆదర్శం


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆపస్ నాయకులు


బుచ్చినాయుడుకండ్రిగ : వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


స్వామి వివేకానంద చిత్రపటానికి విద్యార్థుల నివాళి

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ యువజనోత్సవం నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుత యువత ఆయన మార్గం అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాగరాజు, ప్రకాష్, అంజనీప్రసాద్, సుబ్రహ్మణ్యం, మంగిరెడ్డి, వీరాస్వామిరెడ్డి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీడీలు కిషోర్, మస్తాన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే బుచ్చినాయుడుకండ్రిగలోని పుర వీధుల్లో సహజ సంపద ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానంద, యోగా గురువు సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానందుని జయంతి ఉత్సవాలను స్కౌట్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూత్ చైర్మన్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ధనుష్, శ్రీనివాసులు, తనూజ్, నిఖిల్,మునిరాం, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న హైకోర్టు న్యాయవాది వైబీఎస్ బాపూజీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట విమానాశ్రయం మార్గంలోని అక్షయ క్షేత్రంలోని దివ్యాంగులకు తిరుపతికి చెందిన హైకోర్టు న్యాయవాది వైబీఎస్ బాపూజీ (బాబ్జి) సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు తన వంతు సాయంగా అందించిన చిన్న చేయూత కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, అక్షయ క్షేత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

పీఎం ఫసల్ బీమా ప్రారంభం

శ్రీకాళహస్తి : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రారంభమైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు సమీపంలోని మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

పల్లె సంబరం

- స్వగ్రామాలకు పయనం
- ధరల మంటతో జనం బెంబేలు



సంచారం చేస్తున్న గంగిరెద్దుల కళాకారులు, పెద్ద పాండూరులో భోగి మంటకు సామగ్రి సిద్ధం చేస్తున్న చిన్నారులు

వరదయ్యపాళెం : సంక్రాంతి సంబరాలకు పల్లెలు సిద్ధమయ్యాయి. బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారంతా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఇళ్లకు రంగులద్ది ముస్తాబు చేశారు. భోగి మంటలకు సరంజామా సిద్ధం చేశారు. సంక్రాంతి సెలవులు శుక్రవారం నుంచి మొదలవడంతో ఎక్కడ చూసినా పల్లెల్లో చిన్నారులు, యువకులు ఆటలతో సందడి చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచే మహిళలు ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగవల్లులు తీర్చిదిద్దేందుకు సిద్ధమయ్యారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

ఇంటికి దూరంగా ఉంటున్న వారంతా సంక్రాంతికి ఇళ్లకు చేరుకున్నారు.కానీ చేతిలో సమయానికి సరిపడా డబ్బులు లేవు. గతంలో జగనన్న సంక్షేమ డబ్బులు అందేవి. నేడు ధరలు చూస్తే మండిపోతున్నాయి. కూరగాయల నుంచి నిత్యావసర సరుకుల వరకు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నలుగురితోపాటు నారాయణ అన్న చందంగా అందరితో పాటు మొక్కుబడి పండుగను జరుపుకునేందుకు సిద్ధం అయ్యారు.

కళలకు ఆదరణ కరువు

కళల లోగిలిగా భావించే సంక్రాంతి పండుగ సమీపిస్తున్నా కళాకారుల జాడ కనిపించడం లేదు. గతంలో సంక్రాంతి వచ్చిందంటే ఇళ్ల ముందు గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిలో హరి అంటూ హరిదాసులు, అయ్యవారికి దండం పెట్టు, అమ్మవారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దులతో ఆటగాళ్లు చేయించే విన్యాసాలు, శంభో శంకరా అంటూ జంగం దేవర్ల సందడి పల్లెల్లో నెలకొనేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తెలుగువారి అచ్చ తెలుగు పండుగ కళ తప్పుతోంది. జానపద కళలకు ఆదరణ తగ్గిపోయింది. దీంతో గంగిరెద్దుల వారు, హరిదాసులు, జంగందేవర్లు తదితర కళాకారులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారు. తరతరాలుగా చేస్తున్న వృత్తిపై మమకారం ఉన్నవారు అరుదుగా గ్రామాలు, పట్టణాల్లో గంగిరెద్దులతో తిరుగుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.